

మళ్ళీ తెల్లవారింది.

జగన్నాటకంలో ప్రాణుల నటన మొదలయింది.

రంగస్థలాన్ని కాంతివంతంచేసే ఫుట్ లైట్‌లా సూర్యుడుద యించాడు.

పద్మజ చిటపట లాడుతోంది. వంటింట్లోంచి కుళాయి దగ్గరికీ- కుళాయి దగ్గర్నుంచి వంటింట్లోకీ విసవిసా తిరిగేస్తోంది మధ్యమధ్యలో వంటింట్లోగిన్నెలుఎగురుతున్నాయి.

బారెడు పొద్దెక్కింది - ఒక్క పనీ తెమలలేదు.

కాఫీ డికాషను కలుపుకుని కూర్చుంది. పాలమనిషి యింకా రాలేదు. రాత్రి బట్టలు సర్ఫ్‌లో

# తారతమ్యం

— భమిడిపాటి అనంతశర్మ




వానబెట్టింది. పని మనిషి రాలేదు.

కుళాయిలో నీళ్ళు సన్నసన్నగా వడుతున్నాయి తను నీళ్ళు పట్టుకోలేదు-బెంగ! ప్రక్క వాటాలో వున్నావిడ ముందే పట్టేసుకుంది-బాధ! ఆవిడ మనసులో బాధ-బెంగ-కోపాలు కలిసి పని చేస్తూండటం వల్ల చేతులో గిన్నెలూ, నోట్లో మాటలూ కొంచెం దురుసుగా ప్రవర్తిస్తున్నాయి.

సరిగ్గా అప్పుడే వచ్చింది మంగమ్మ.

"గిన్నెలేశారా అమ్మగారూ!" పెరట్లోంచి కేకేసింది.

"వచ్చారా అమ్మగారూ! మీ ఇంటికే మోసుకొద్దామనుకుంటు

న్నామ-గిన్నెలు. నువ్వు దయ చెయ్యంటే గిన్నెలెలా తగలెయ్య మంటావేః" అని ఆ పనిలోనే వుంది 'నువ్వు తగలడకుండా గిన్నెలెలా దయచెయ్యమంటావే' అని ఆవిడ అసలు భావం.

"అది కాదమ్మగారూ...."ఏదో చెప్పబోయింది

"ఒసేయ్ మంగమ్మా! ఇంకేం చెప్పకు విన్న నువ్వు వెళ్ళేటపుడు నీకేం చెప్పానేః కొంచెం పెంద రాళే రమ్మని మొత్తుకోలేదూ! అందుకని రోజూ కంటె ఆల స్యంగా వచ్చావన్నమాట!" అని గిన్నెలు తగలేసింది కొబ్బరి మొక్క మొదట్లో.

"అది కాదండమ్మ గారూ! రాత్రంతా మా చంటోడికి వాంతు లండమ్మగారూ! రాతంత్రా కంటి మీద కునుకులేదు తెల్లారి పోతుం డగా కునుకట్టింది. లేచేటప్పటికి పొద్దెక్కి పోయింది చింతపండె య్యండి!" ఓ యాటుకముక్క వేసు కుని కూర్చుంది.

తన కొడుక్కి బాగా లేదనే బాధని- తను పెందరాళే రాలేకపోయి నందుకు చెబుతున్న సంజాయిషీ మాటల్లో కలిపి చెప్పింది.

యజమాని ఆజ్ఞను ధిక్క రించడానికి కారణమైన తనబాధని- సంజాయిషీలో కలిపి చెప్పి తన బాధకి యజమాని సానుభూతిని పొందగోరటం నౌకరు లక్షణంః సంజాయిషీ వెనుక బాధని తన ఆజ్ఞ మీరినందుకు ఆ నౌకరు పడు తున్న సంతాపంలా గ్రహించటం యజమాని లక్షణం

మంగమ్మ చెప్పిన చంటాడికి ఏడాది వెళ్ళలేదు

"విన్నటిదాకా నీకు వాంతులు, ఇప్పుడు నీ కొడుక్కి వాంతులు. వెలుగురాకుండా రావాలే అని చెప్పి చెప్పి నా నోరు పడిపోయింది. ఒసేవ్ మంగమ్మా!" చింతపండు పడేసింది "నీ వరసేం బాగులేదు. నీ కిష్టం ఉంటేనే చెయ్యి - లేక పోతే మానెయ్ అంతేకాని-ఇలా వచ్చీరాక-పెందరాళే రమ్మంటే పొద్దెక్కి వచ్చి నా ప్రాణాలు తియ్యకు" అని మళ్ళీ నోరుపడేసు కుంది పడేసుకుంటే నోరు పడి పోక ఏం చేస్తుందిః

ఈ గొడవతో కృష్ణారావుకి మెలకువవచ్చింది. పెళ్ళాం కేకలకి ఉలిక్కిపడ్డాడు. కళ్ళు విప్పి ఎదు రుగా గడియారాన్ని చూసి ఉలిక్కి పడ్డాడు ఈ వేళ రోజూకంటే ముందుగానే లేచాడు. కాని ఆలస్యం అయిపోయింది. విన్న ప్రిన్సిపాల్ పిల్చి, "మిస్టర్

కిష్టాప్రివ్! రేపు సెకెండ్ అవర్‌లో ఫైనల్ బి. ఏ. క్లాసు ఎంగేజ్ చెయ్యండి" అని పెంపు పెట్టిన ఇంకో లెక్చరర్ క్లాసు తనకి అప్పజెప్పేడు. అసలు అతని వర్కు రోజూ పదిగంటలకు మొదలవుతుంది ఈ క్లాసు ఎనిమిదీ ఇరవై కేతీసుకోవాలి ఇంక ఇప్పుడు ఎంత తొందరపడి పరుగెత్తినా ఆ వేళకి చేరుకోడం అసంభవం.

అందుచేత తొందర పడటం మానేశాడు. మామూలుగా పది గంటలకేవెళ్లొచ్చులే- అనుకున్నాడు మరి ప్రిన్సిపాలు మెమో యిస్తే? ఎలా ఇస్తాడు? ఆ విషయం కాగితం మీద లేదుగా!

అలాగే ఆలోచిస్తూ - బద్ధకంగా దొర్లుతూ ఇంకో పది నిముషాలయ్యాక లేచాడు.

లేచి పద్మజని అడిగాడు అతి నెమ్మదిగా - "ఏడున్నరకి లేపాలని చెప్పేను కదా పద్మా! లేపలేదేం?" ఆవిడ పేరు పగలు పద్మజ, రాత్రి మజ.

"చెప్పేరు లెండి! ఈ మంగ రాక ఇప్పటిదాకా పనిలో సగం చచ్చాను. నిన్న నెత్తీ నోరూ కొట్టుకు చెప్పేను దానికి-తెల్లారగానే రమ్మని దాని కిప్పుడు తెలారింది!" అయి మంది ఘట్టిగా!

మరింక మాట్లాడకుండా తన పనిలో పడ్డాడు. ప్రిన్సిపాలు తనకి నెత్తీ నోరూ కొట్టుకు చెప్పలేదు కదా-ఫరవాలేదు.

అన్నీ పన్యా అయి కాలేజీకి వెళ్ళడానికి సిద్ధంఅయ్యేసరికి పదికొట్టింది గడియారం. మళ్ళీ అంగారుపడటం మొదలుపెట్టేడు- సైకిలు కిందకు దింపుకుంటూ. కాలేజీకి వెళ్ళడానికి పావుగంట పడుతుంది ఎందుకైనా మంచిదని కాలేజీగడియారం కంటే తన గడియారం పది నిమిషాలు ముందుకి పెట్టుకున్నాడు - తొందరగా తెమలవచ్చుని కాని ఎప్పుడూ పది కొట్టందే బయలుదేరలేదు— మన గడియారం పది నిముషాలు ఎక్కువ తిరుగుతోంది కదా అనుకుంటూ!

"రేపు సెలవు పెట్టండి-ఇంట్లో పనుంది" అంది పద్మజ గుమ్మం దగ్గరకొచ్చి.

'ఏం? ఎందుకు?' అన్నట్లు చూశాడు నుదురు విరిచి - కనుబొమలుఎత్తి-తల నిలువుగాఆడించి.

"రేపు నా పుట్టినరోజు. సరదాగా భోజనంచేసి, కాస్సేపు పేకాడుకొని ఏదైనా మ్యాటనీకి వెళ్దాం" అంది.

"సరే" అన్నాడు అతనికేం సరదాగా లేకపోయినా.

• • •

ఆఫీసరుకి ఎదురుగాను గాడిదకి వెనకాల నిలబడకూడదట.

అంచేత ప్రిన్సిపాలు కళ్ళ బడ దల్చుకోలేదు ఆ రోజు కృష్ణారావు కాని సెలవు కాగితం యివ్వడానికి వెళ్ళక తప్పలేదు.

"గుడ్ మార్నింగ్ సర్!" అన్నాడు స్ప్రింగ్ డోర్ తెరుచు కొని లోపలికి వెళ్ళి.

"టేక్ యువర్ సీట్ మిస్టర్ కిష్టారావ్!" అన్నాడు ప్రిన్సిపాలు.

అంటూండగానే-

"సారీ సర్! పొద్దున్న సెకండ్ అవర్‌కిరాలేకపోయాను" అన్నాడు.

"ఇట్స్ ఆల్‌రైట్! పెషన్ మధ్యలో క్లాసు ఎంగేజ్ కాక పోతే ఎలా? స్టూడెంట్సు క్లాసులో వుంటే ప్రక్క క్లాసులకి డిస్టర్బెన్స్! బయటికి పంపేస్తే రోడ్డుమీద న్యూసెన్సు" అన్నాడాయన సర ళంగా.

తమాయించుకున్నాడు కృష్ణా రావు. మందే గుండెని అదిమి పట్టాడు. ముఖంమీద చిరునవ్వు కష్టపడి నిలదొక్కుకుంది. మామూ లుగా అయితే ఒక కాలే భూమ్మీద వుండేది.

జేబులోంచి సెలవుచీటీ తీసి ఎదురుగా టేబుల్‌మీద పెట్టేడు.

"మిస్టర్ కిష్టారావ్! పోస్ట్‌పోన్ చేసుకోలేరూ?" అన్నాడు ప్రిన్సి పాలు లీవ్ లెటర్‌లో రీజన్ కాలమ్ చదివి.

ఇదేమాట పద్మజ వింటే ప్రిన్సి పాలు మొహం తగలేసును-"పుట్టిన రోజు వాయిదా వేసుకోడం ఏమి టయ్యా-నీకు ఎన్నేళ్ళొచ్చాయి?" అని.

కాని కృష్ణారావు — మా ఆవిడ పుట్టినరోజు, సరదాగా మేం ఇద్దరం భోంచేసి, హుషారుగా పేకాడుకుని, సాయంత్రం షికారుగా సినిమాకు వెళ్ళాలని రాయలేదు. వూరెళ్ళాలని రాశాడు. ఇదివరకయితే సిక్ అని రాసేవాడు-హెల్త్ గ్రౌండ్స్ మీదడి గితే కాదనడనే ధైర్యంతో. కాని ఈ ప్రిన్సిపాల్ వచ్చాక-ఓసారి సిక్ అని సెలవు పెడితే - సాయంత్రం ఇంటికొచ్చేదు చూచి పోదామని. అంచేత అర్జంటు పనిమీద ఊరెళ్ళా లని రాశాడు. దాన్ని పోస్ట్‌పోన్ చేసుకోలేరా-అన్నాడు ప్రిన్సిపాలు. అని నాలుగు సెలవు కాగితాలు బయటికి తీశాడు.

"ఇంతమంది ఒకేరోజు సెలవు పెడితే పనెలా జరుగుతుంది?" అని అడిగేడు.

"ఇది ఫిబ్రవరి నెల. అప్పుడే మీరు ఐదు సెలవులు పెట్టేశారు. ఇంకా ఈ నెల పధ్నాలుగో తారీకు. ఇది ఈనెల్లో మూడో సి. ఎల్. ఈ

వచ్చేలాగు రోజుల్లోనూ రెండు ఆదివారాలూ, ఒక పబ్లిక్ హాలీడే వచ్చాయి" అన్నాడు.

ఒళ్ళు మండిపోయింది కృష్ణారావుకి. "నాకు సెలవు కావాలి వాయిదా కుదరదు" అన్నాడు.

"సెలవు ఉద్యోగి హక్కు కాదు. తెల్సునా?" కాండక్టు రూలు చదివేడు ప్రిన్సిపాలు

"సాధారణ పరిస్థితిలో మీరు సెలవు కాదనడానికి కూడా వీలు లేదు. ఇదేం అసాధారణమైన కొంపలు మునిగిపోయే పరిస్థితి కూడా కాదు" అని, "ఇదిగో సెలవు కాగితం. మీ ఇష్టం" అని చర్రున బయటికి వచ్చేశాడు. అలా వచ్చేసి చరచర స్టాఫ్ రూంకి వెళ్ళాడు.

"ఎమర్జన్సీ పోయినా ఆ జులుం ఆ వాసనా పోలేదు" కస్సుమన్నాడు. జనాంతికంగా అక్కడ కూర్చున్న వాళ్ళందరూ ఈ హటాత్పరిణామానికి ఆశ్చర్యపడి తలలు తిప్పేరు. ఏమీ అడగలేదు.

"అసలు ఏమిటండీ ఈ వరస? వెధవది ఓ సి.ఎల్ కి కూడా ఇలా ప్రాణాలు తోడేస్తున్నా డేమిటి తన ప్రాణాలు పోతాయన్నట్లు? రూలు ప్రకారం ఉన్న సెలవులకంటె ఒకటి కూడా మనం ఎక్కువ అడగలేం-తను ఇవ్వనూ లేదు. ఉన్నవి ఇవ్వడానికి ఏడుపెందుకు? ఫిబ్రవరి నెలకే అయిదయిపోయే యంటా దేవిటి? వీడికేం? ఎవడబ్బ సొమ్ము? (గవర్నమెంటు ఎవడికీ అబ్బ కాదు- ఉమ్మడి గొడ్డు!) తను ఎన్ని సెలవులు పెడుతున్నాడో ఎవడన్నా అడిగేడా? దేవుడు వరమిచ్చినా పూజారి వర మివ్వనట్టు!" అవీ-ఇవీ-ఏవేవో కడిగేసేడు. ఆ మాటలన్నీ రకరకాలుగా రూపాంతరాలు చెంది ఆయనకి చేరుతాయని కూడా తెలుసు.

"ఏం చేస్తాడేమిటి? మహా చేస్తే ట్రాన్స్ఫర్ చేయిస్తాడు- పోతాం" అన్నాడు.

• • •

సాయంత్రం ఇంటి మొహం పట్టేను. అరుగంటల వేళ-వీధి అదిరిపోయేలా - ఇల్లు ఎగిరిపోయేలా కేకలు వేస్తోంది పద్మజ. దూరం నుంచే వినిపిస్తున్నాయి. ఇంటికి

వెళ్ళి చూసేవరికి ఆవిడ గిన్నెలు తోముకుంటోంది. కారణం అడగ లేదు. అడిగితే తనను కూడా ఓ చెయ్యి వెయ్యమంటుందని భయం.

తోమడం అయ్యాక అతను అడక్కుండానే-తనకి తను చెప్పు కుంటున్నట్లుగా - "ఇంక దాన్ని భరించలేను. ఈ వేళ పద్నాలుగో తారీకు. ఈ రోజు అప్పుడే రెండో రోజు మానేసింది. చూసి చూసి నేనే తోమేసుకున్నాను. ఇంక రా నక్కర లేదని కబు రంపేసేను. సరిగ్గా మనకి పని ఎక్కువున్న రోజే అదీ మానేస్తుంది. ఎవరు పడగల రీ పని మనుషులతో? నేనే చేసు కుంటాను - ఏం మొక్క మొల్చి పోతానా?" అని అరిచింది.

తనకితనే చెప్పుకుంటున్నప్పుడు అరవడం ఎందుకు? బహుశః తనకి చెవుడని తనకే అనుమాన మేమిటి?

రాత్రి ఎవరో చెప్పేరు-మంగమ్మ కొడుక్కి సీరియస్‌గా వుందని, ఆసుపత్రిలో చేర్చేరని. మంగమ్మ కూడా అక్కడే ఉందని.

• • •

రాత్రి పక్క మీద దొర్లుతూం డగా-ఇంకా పద్మజ వంటింట్లోంచి రాలేదు.

కృష్ణారావుని ఎవరో ప్రశ్నిం చేరు—

ప్రశ్న: పనిమనిషిగా మంగమ్మ మంచి యజమానురాలుగా నీ భార్య ఆశిస్తున్న పనితనాన్ని, ఉద్యోగిగా నువ్వు నీ ప్రభుత్వానికి చూపి స్తున్నావా? ఉద్యోగస్తుడిగా నువ్వు నీ యజమానినుంచి ఆశిస్తున్నగౌర వాన్ని నదుపాయాన్ని - కనీసం అందులో సగాన్ని నీ పని మనిషికి నీ భార్య ఇస్తోందా?

కృష్ణారావు సమాధానం: అసలు నాకూ మంగమ్మకీ పోలిక ఏమిటి? నేను పోస్ట్ గ్రాడ్యుయేట్‌ని, ఆఫీసరుని. మంగమ్మ - నిశాని. అప్రాల్ పనిమనిష.

ఉపప్రశ్న: (1) పోస్ట్‌గ్రాడ్యు యేట్ ఆఫీసరు అంటే నిశాని పని మనిషికున్న పాటి (లేదా-ఉండవల సిన) నిజాయితీ ఉండకూడదా? (2) పోస్ట్ గ్రాడ్యుయేట్ ఆఫీసరు

కున్నంత స్వేచ్ఛలో-సౌందర్యంలో -హక్కులో సగంకూడా విశాఖ పనిమనిషికి ఉండకూడదా?

కృష్ణారావు సమాధానం: ఈ లాజిక్‌లో ఏమాత్రం పసలేదు-ట్రాష్. •


# శ్రీ బాలాజీ వైద్యశాల

సెక్సు స్పెషలిస్టు డా॥ పి. కుమారస్వామి దేవర

మార్వాడీ గుడివద్ద: ఫోన్: 551, తెనాలి (ఎ. పి.)

బ్రాంచి: 26, నార్తుబోగ్‌రోడ్, మద్రాసు-17.

## దీర్ఘ వ్యాధులకు ఉత్తమ సిద్ధ వైద్యము



హస్తప్రయోగంవల్ల, అతి సంభోగము వలన అంగము చిన్నదై అకస్మాత్తుగా అంగము కృశించుట, శుక్లనష్టము, నపుంసకత్వము, (ఒక్క డోస్‌తో ఎన్నడూ, కనివిని ఎరుగనంత వీర్యస్తంభన కలిగి హాయి ఇచ్చును. అసంతృప్తి చెందు స్త్రీ, పురుషులు వాడదగినది వ్యస్థులు) హెర్నియా (గిలక) కుష్టు, బొల్లి. చర్మ వ్యాధులకు పోస్టుద్వారా వైద్యం చేయబడును వరిబీజము (బుడ్డ), మూత్రవ్యాధులు ఆపరేషన్ లేకుండా నయం చేయబడును. స్వయంగా రండి.

క్షయ, ఉబ్బస వ్యాధులకు వుచిత వైద్యం - రండి.

బ్రాంచీలు:-తిరుపతి, నెల్లూరు, గుంటూర్లలో త్వరలో తెరువబడును.